క్లుప్తంగా

నేరాల నియంత్రణపై అవగాహన



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగర పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న నేరాలపై పోలీసులు చేరువ వాహనం ద్వారా యువకులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ మేరకు బుధవారం సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏలూరు లాకులు, ఆల్ఫా హోటల్ సెంటర్‌తో పాటు వివిధ ప్రదేశాలలో ప్రజలకు.. పోలీస్ అధికారులు, సిబ్బంది చేరువ వాహనం ద్వారా అవగాహన కల్పించారు. నేరాలు జరిగే కంటే అవి జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, ముఖ్యంగా యువతకు సోషల్ మీడియా, సైబర్ క్రైమ్ నేరాల గురించి అవగాహన కల్పించడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని దిశ పోలీసు అధికారులు అవగాహన కల్పించారు. వీటితో పాటు చిన్నపిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంటే ఏంటి అనే విషయాల గురించి, నేరాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి, చిన్న చిన్న వీడియోల రూపంలో ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దిశా పోలీస్ స్టేషన్ పోలీస్ అధికారులు, ఎస్ఎన్‌పురం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలకు ఎక్స్‌లెన్స్ అవార్డు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు ఏపీ ఉన్నత విద్యామండలి 'ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్–2023' అవార్డును ప్రదానం చేసినట్లు ఆ కళాశాల కార్యదర్శి పడుచూరి లక్ష్మణస్వామి తెలిపారు. ఈ మేరకు నగరంలో ఏపీ ఉన్నత విద్యామండలి నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో తమ కళాశాలకు ఈ అవార్డును అందించారన్నారు. విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన చేస్తున్నందుకు యూజీసీ అనుబంధ సంస్థ నాక్ నుంచి ఏ డబుల్ ప్లస్‌ను సాధించిన నేపథ్యంలో ఉన్నత విద్యామండలి ఈ అవార్డుకు తమను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ ఆచార్య కె.రామ్మోహనరావుల చేతుల మీదుగా ఈ అవార్డును తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జే లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత రాజరాజేశ్వరిపేట మహంకాళీ గుడి ప్రాంతంలో మొక్క కనకారావు కుటుంబం నివాసం ఉంటోంది. కనకారావు తాపీ పని చేస్తుంటాడు. కనకారావు తన అవసరాల కోసం ఏడాది క్రితం అతావుల్లా అనే వ్యక్తి వద్ద రూ.2 వేలు అప్పుగా తీసుకున్నాడు. కొంత కాలం కిందట రూ.500 జమ చేయగా, ఇంకా రూ. 1500 బాకీ ఉన్నాడు. బుధవారం ఉదయం స్థానికంగా ఉన్న కరిముల్లా హోటల్ వద్ద టీ తాగుతున్న కనకారావుకు అతావుల్లా, అతని స్నేహితుడు కింగ్‌కాంగ్‌లు కనిపించాడు. బాకీ డబ్బులు గురించి అడగ్గా, సాయంత్రం ఇస్తానని చెప్పాడు. దీంతో ఎంత కాలం ఆగాలి అంటూ అతావుల్లా, కింగ్‌కాంగ్‌లు కనకరావుపై దాడి చేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజలందరికీ వైద్యం అందించడమే లక్ష్యం

- నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి
- 39వ డివిజన్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, అధికారులు

పటమట(విజయవాడతూర్పు): ప్రజలందరికీ వైద్యం అందాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని 39వ డివిజన్ 116, 117, 118 సచివాలయాల పరిధిలో కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం బుధవారం జరిగింది. కార్యక్రమానికి హాజరైన మేయర్ మాట్లాడుతూ.. పైసా ఖర్చు లేని అత్యాధునిక వైద్యం ప్రతి ఒక్కరికీ అందాలన్నదే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమన్నారు. అందులో కంటి సమస్యలను కూడా పరిష్కరించడం గమనార్హమన్నారు. రూపాయి ఖర్చు లేకుండా ఎలాంటి ఆరోగ్య సమస్యనైనా స్పెషలిస్ట్ డాక్టర్లు చూస్తున్నారని, జగనన్న సురక్ష ద్వారా ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి అందరి బాగోగులు చూడాలని సీఎం వైఎస్ జగన్ మోహన రెడ్డి ఆశయనమి పేర్కొన్నారు. నాడు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 108, ఆరోగ్యశ్రీ లాంటి వసతులు అందుబాటులోకి తీసుకువచ్చి పేదోళ్ల ఆరోగ్యానికి భరోసా కల్పించారన్నారు. అనంతరం ఆయన తనయుడు ఏపీ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు పెంచడమే కాకుండా రెండు మూడు డివిజన్లకు ఒక ప్రైమరీ హెల్త్ సెంటర్‌తో ప్రజా ఆరోగ్యం కాపాడుతున్నారని చెప్పారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా పాలన

ప్రతి పీహెచ్‌సీలో మందులు ఉచితంగా ఇవ్వడమే కాకుండా ఇప్పుడు ఇంటింటి సర్వే చేసి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ద్వారా ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని మేయర్ చెప్పారు. నగరవాసులు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరానికి వచ్చే ప్రజలందరికీ అవసరమైన వైద్యాన్ని అందించాలని నగరపాలక సంస్థ మెడికల్ ఆఫీసర్లకు సూచించారు. వైద్యాధికారులు పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో 39వ వార్డు కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ, ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ – 1 డాక్టర్ రవిచంద్, శానిటరీ సూపర్‌వైజర్స్, సచివాలయం కన్వీనర్లు, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా..

భవానీపురం(విజయవాడపశ్చిమ): రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా స్పెషలిస్ట్ వైద్యుల సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రవేశపెట్టిందని గొల్లపూడి పంచాయతీ స్పెషల్ ఆఫీసర్(ఎంపీడీఓ) బాపతి భార్గవి రెడ్డి పేర్కొన్నారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని మండల ప్రజాపరిషత్ ఎలిమెంటరీ పాఠశాలలో బుధవారం పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని ఆమె పర్యవేక్షించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన అన్ని విభాగాలను పరిశీలించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే అక్కడికి వచ్చిన రోగులను పరామర్శించి, అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా 7 రకాల పరీక్షలు నిర్వహించి అవసరానికి అనుగుణంగా మందులు కూడా ఉచితంగా అందిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గొల్లపూడి 10వ సెగ్మెంట్ ఎంపీటీసీ షేక్ సైదాబీ, ఆమె భర్త, ఫకీర్ ముస్లిం సంఘు రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హిమవలీ పేషెంట్లకు ఉచిత మందుల కిట్లను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ స్వరూపరాణి, విజయవాడ రూరల్ మండల అధ్యక్షుడు కాటమనేని పూర్ణ, కో ఆప్షన్ సభ్యుడు అల్తాఫ్, గొల్లపూడి పీహెచ్‌సీ వైద్యురాలు పద్మావతి, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



డాక్టర్లతో మాట్లాడుతున్న ఎంపీడీవో బాపతి భార్గవి

కొండ ప్రాంత వాసులకు జేఎన్‌ఎన్‌యూఆర్ఎం ఇళ్లు కేటాయించాలి



పటమట(విజయవాడతూర్పు): కొండ ప్రాంతాల్లో ప్రమాదకరమైన చోట నివాసముంటున్న వారికి రాజరాజేశ్వరిపేటలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు కేటాయించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారు. నగరంలోని సర్కిల్–1 పరిధిలోని 54వ డివజన్‌లో మిలాబ్ హోటల్ ముందు ఉన్న కొండ ప్రాంతాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. కొండచరియలు పడేటట్లు ఉండటం గమనించిన కమిషనర్ అక్కడ నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించి వారికి రాజరాజేశ్వరీ పేటలో గృహాలను కేటాయించాలని అధికారులను ఆదేశించారు. రాంగోపాల్ సత్రం వీధి, పంజా సెంటర్ పలు వీధులు, కొండ ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ విధానాన్ని స్థానికంగా ఉన్న సమస్యలను పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన ముసాఫీర్ షాదీఖానా ముందు ఉన్న స్థలంలో ఫుడ్ కోర్ట్‌ను ఏర్పాటు చేసే విధంగా అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానికులతో మాట్లాడారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ అబ్దుల్ అర్షద్ అకీబ్, ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ – 1 డాక్టర్ రవిచంద్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నారాయణమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.7 లక్షలు మంజూరు

పటమట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో అందరి సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని, ఆరోగ్య సమస్యలపై వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా ఆయన చర్యలు తీసుకుంటున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. ఆయన నగరంలోని గుణదల ప్రాంతంలో నివసించే ఆటోడ్రైవర్ ప్రసన్న కుమార్, సుమతి దంపతుల పెద్ద కుమారుడు నమన్ ఈ నెల 4వ తేదీన ఆడుకొంటూ పడిపోవడంతో వెంటనే నగరంలోని రెయిన్‌బో ఆస్పత్రికి తీసుకెళ్లారన్నారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటిలేటర్ మీద చికిత్స అందిస్తున్నారనే విషయం తెలిసిన వెంటనే అవినాష్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా బాలుడికి ఆరోగ్య పరిస్థితిపై రెయిన్‌బో ఆస్పత్రి వైద్యుల నుంచి సమాచారం తీసుకున్నారు. శస్త్రచికిత్స రూ.15 లక్షలు అవుతుందని అంతఖర్చు తాము భరించలేమని బాలుడి తల్లిదండ్రులు తెలపటంతో వెంటనే సీఎంవోకు సమాచారం ఇవ్వటంతో నాలుగు గంటల వ్యవధిలో సీఎం సహాయనిధి నుంచి బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.7 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అనుమతి మంజూరు చేశారు. ఎల్‌వోసీను దేవినేని అవినాష్ ఆస్పత్రి యజమాన్యానికి అందించారు. ఈ సందర్భంగా ధైర్యంగా ఉండాలని బాలుడి తల్లిదండ్రులకు భరోసా ఇచ్చి ఇక ముందు కూడా ప్రభుత్వం నుంచి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



రెయిన్‌బో ఆస్పత్రి యాజమాన్యానికి ఎల్‌వోసీని అందజేస్తున్న దేవినేని అవినాష్

బాలికలను మరింతగా ప్రోత్సహించాలి

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బాలికలే భవిష్యత్‌గా గుర్తించి, వారిని మరింతగా ప్రోత్సహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. అన్ని రంగాల్లో బాలికలు ముందుండేలా కృషి చేయాలని చెప్పారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మేరీ స్టెల్లా కళాశాల, చైల్డ్ లైన్ 1098, పోలీస్, ఐసీడీఎస్, బాలల హక్కుల పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో ముద్రించిన బాలికలే భవిష్యత్ అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ ఢిల్లీరావు విడుదల చేశారు.

ఆడపిల్లలే కావాలన్న పరిస్థితి..

కలెక్టర్ మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారన్నారు. ఈ తరుణంలో మహిళల ప్రాధాన్యత పెరిగిందన్నారు. బాలికల ఒక నాటి చులకన భావన నేడు లేదని చెప్పారు. తల్లిదండ్రులు తమకు ఆడపిల్లలే కావాలన్న పరిస్థితులను నేడు చూస్తున్నామన్నారు. ప్రభుత్వం బాలికల సంరక్షణకు అనేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా బాల్య దశ నుంచే బాలికల ఆరోగ్య విషయాలపై ప్రత్యేక శ్రద్ధపెడుతోందన్నారు. దీనితో పాటు కౌమార దశ నుంచి పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులను నివారించి వారి హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది అక్టోబర్ 11న అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బాలికలు ఎదుర్కొంటున్న లింగవివక్ష, అసమానతలపై అవగాహన కల్పించడమే బాలికా దినోత్సవం ప్రధాన ఉద్దేశమన్నారు. బాలికలు చైల్డ్ లైన్ 1098, ఉమెన్ హెల్ప్ లైన్ 181, పోలీస్ 100, 112 ఉచిత ఫోన్ సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డ్వామా పీడీ జె.సునీత, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో–ఆర్డినేటర్ అరవ రమేష్, మేరీ స్టెల్లా కళాశాల సోషల్ వర్క్ సిస్టర్ సహాయ మేరి, బర్డ్స్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు

రవాణా వాహనాలను నగరంలోకి అనుమతించాలి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): దసరా మహోత్సవాల సందర్భంగా రవాణా వాహనాలపై విధించిన ఆంక్షలను సడలించాలని కోరుతూ ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ నేతలు బుధవారం పోలీస్ కమిషనర్ టీకే రాణాను కలిసి విజ్ఞప్తి చేశారు. రవాణా వాహనాలు ఇన్నర్ రింగ్ రోడ్డు, వైవీ రావు ఎస్టేట్, చనుమోలు వెంకట్రావు ఫ్లై ఓవర్, ఐరన్ యార్డు మీదుగా గొల్లపూడి నుంచి గూడ్స్ వాహనాలు బయటకు వెళ్లడానికి అనుమతించాలని కోరారు. వివిధ నగరాల నుంచి గూడ్స్ వాహనాలు రాత్రి వేళల్లో నగరంలోకి ప్రవేశించి లోడింగ్, అన్ లోడింగ్, మరమ్మతులు ముగించుకున్న తరువాత పగటి వేళ నగరం బయటకు వెళ్లడానికి అనుమతి లేనందున తిరిగి రాత్రిసమయం వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకుంటుందన్నారు. దీంతో రవాణా వాహన యజమానులకు తీవ్ర అసౌకర్యంతో పాటు ఆర్థికనష్టం కలుగుతుందని వినతి పత్రంలో పేర్కొన్నారు. సీపీని కలసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు తమ్మల లక్ష్మణస్వామి, ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి వీరవెంకయ్య, కార్యదర్శులు ఆళ్ల వెంకటేశ్వరరావు, వత్సవాయి కృష్ణంరాజు, సూరపనేని సురేష్, కొల్లి మురళీకృష్ణ ప్రసాద్, యార్లగడ్డ సుందరరావు తదితరులు ఉన్నారు.



పోలీస్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ నేతలు

15 నుంచి దసరా శరన్నవరాత్రులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలోని శ్రీ లలితాంబికా పీఠంలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పీఠం కన్వీనర్ రాంపిళ్ల చైతన్య తెలిపారు. 9 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతి రోజు అమ్మవారికి విశేష అలంకారంతో పాటు పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ చేతుల మీదుగా విశేష అభిషేకాలు, అర్చనలు జరుగుతాయన్నారు. 15వ తేదీ లలితాంబికా అమ్మవారిని శ్రీ గణాంబాదేవిగా అలంకరించి పూజలు చేస్తామని చెప్పారు. 16న శ్రీ బాలా త్రిపురసుందరీదేవి, 17న అశ్వరుడాంబా దేవి, 18న శ్రీ అన్నపూర్ణాదేవి, 19న లలితా త్రిపుర సుందరీదేవి, 20న శ్రీ వైభవలక్ష్మీదేవి, 21న శ్రీ రాజశ్యామలాదేవి, 22న శ్రీ వారాహిదేవి, 23 ఉదయం మహాకాళికాదేవిగా, అదే రోజు సాయంత్రం శ్రీ లలితాంబికాదేవిగా దర్శనమిస్తారన్నారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

15 నుంచి పోలేరమ్మ దేవస్థానంలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఊర్మిళా సుబ్బారావునగర్ గ్రామదేవత పోలేరమ్మ దేవస్థానంలో ఈ నెల 15వ తేదీ నుంచి దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కమిటీ అధ్యక్షుడు సూరసాని రామిరెడ్డి తెలిపారు. పోలేరమ్మ దేవస్థానం ప్రాంగణంలో బుధవారం దసరా మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా 15 నుంచి 23 వరకు వివిధ అలంకారాల్లో అమ్మవార్లు దర్శనమిస్తారన్నారు. 24వ తేదీ మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీ సాయిబాబా మందిరంలో బాబావారి సమాధి ఉత్సవం, అదే రోజు సాయంత్రం 6 గంటలకు అమ్మ వార్లకు అఖండ హారతులు ఇస్తామని చెప్పారు. 25వ తేదీ మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం గ్రామ దేవత పోలేరమ్మ, లక్ష్మీ సాయిబాబా ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి గుత్తావళి విజయబాబు, కోశాధికారి దొడ్డా వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి మాగం ఆత్మారాము, ఆలయ అర్చకులు గంటి సన్యాసిరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



దసరా మహోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రామిరెడ్డి తదితరులు

బ్రహ్మోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు



విజయవాడకల్చరల్: లబ్బీపేట శ్రీశారదా చంద్రమౌళీశ్వరులు, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. శ్రీ కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో శోభకృతు నామ సంవత్సర వార్షిక బ్రహోత్సవాలు నిర్వహించనున్నారు. 15వ తేదీ శనివారం అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠ, అజసహస్రదేవతా రాధన, విశ్వక్షేన పూజ నిర్వహిస్తారు. 16న నవకుంభ సాధన, 17న నిత్యహోమం, బలిహరణ, 18న కుంభమంత్రణం, 19న నిత్యహోమం, 20న శ్రీవారి కల్యాణోత్సవం, 21న మహా హోమం, 22న సప్తరుషి పూజ, 23న గరుడోత్సవం అష్ట కలశ స్థాపన, 24న డోలోత్సవం, 25న పవళింపు సేవ, వసంతోత్సవం జరుగుతాయి. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పూజాది కార్యక్రమాలు కొనసాగుతాయి.

జాతీయ సమైక్యతను చాటిన నృత్య ప్రదర్శనలు

విజయవాడకల్చరల్: భారతీయ కళావైభవం వెల్లువిరిసింది. దేశంలోని వివిధ రాష్ట్రాల సంప్రదాయ నృత్యాలను కళాకారులు ప్రదర్శించి జాతీయ సమైక్యతను చాటారు. దసరా మహోత్సవాల నిర్వహణ కమిటీ, మాకినేని బసవ పున్నయ్యా విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో దసరా సాంస్కృతిక మహోత్సవాల సందర్భంగా బందరురోడ్డులోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞానకేంద్రంలో పలు రాష్ట్రాల సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. కూచిపూడి, భరతనాట్యం, రాజస్తానీ, దాండియా, పంజాబీ కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. నాట్యాచార్యులు పిళ్లా ఉమామహేశ్వర పాత్రుడు, సప్తా శివకుమార్, మాగలూరి త్రినాథాచారి, యండం నరేంద్రకుమార్, సట్టువేణుగోపాల్, నాట్యాచారిణులు యల్లా జోస్యుల అనూరాధ, జి.శైలజ, మల్లిశెట్టి అనూష నాయుడు తమ బృందాలతో నృత్యాలను ప్రదర్శించారు. రచయిత్రి వాడ్రేవు వీరలక్ష్మీదేవా కార్యక్రమాలను ప్రారంభించారు. రెండు రోజులుగా సమర్థవంతంగా కార్యక్రమాలు నిర్వహించారని నిర్వాహకులను అభినందించారు. కమిటీ సభ్యులు కె.సరోజ, ఉషారాణి, కావూరి సత్యవతి, సంధ్యారాణి, ఎన్ విద్యాఖన్నా పాల్గొన్నారు.



ఎంబీవీకే భవన్‌లో నృత్యం చేస్తున్న కళాకారులు

సబ్సిడీ రుణాల ద్వారా టిప్పర్ల అందజేత

గుణదల(విజయవాడతూర్పు): పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థికంగా చేయూతనిచ్చే దిశగా జాతీయ బ్యాంకులు కృషి చేస్తున్నాయని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎస్ఎస్ మూర్తి అన్నారు. శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలోని సెంట్రల్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో టిప్పర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు.

దీనిలో భాగంగా జగనన్న బడుగు వికాసం పథకం ద్వారా తమ బ్యాంక్ సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేస్తుందని చెప్పారు. దీని ద్వారా సామాన్యులు ఆర్థికంగా ఎదిగే అవకాశం లభిస్తుందన్నారు. ఎటువంటి భారం లేకుండా రుణాలు చెల్లించగలుగుతారని చెప్పారు. అనంతరం మూడు టిప్పర్లను అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ప్రసన్న, చీఫ్ మేనేజర్ రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.



టిప్పర్లతో బ్యాంక్ అధికారులు, వాహనదారులు

దసరా ఉత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల నేపథ్యంలో దుర్గగుడి మీదుగా వచ్చే ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు ఈవో కెఎస్.రామారావు పేర్కొన్నారు. మోడల్ గెస్ట్ హౌస్ నుంచి టోల్‌గేట్ వరకు క్యూలైన్ల నిర్మాణం జరుగుతున్న క్రమంలో చర్యలు తీసుకున్నామన్నారు. భవానీపురం వైపు నుంచి వచ్చే వాహనాలను, బస్టాండ్, మార్కెట్ నుంచి కుమ్మరి పాలెం వైపు వెళ్లే వాహనాలను దుర్గగుడి ఫ్లై ఓవర్‌తో పాటు సితార, సొరంగం, చిట్టినగర్ మీదుగా మళ్లించామన్నారు. అమ్మవారి ఆలయానికి వచ్చే వాహనాలను కుమ్మరిపాలెం మీదుగా అనుమతించరని చెప్పారు. గట్టువెనుక ప్రాంతానికి చెందిన వారితో పాటు వన్‌టౌన్ వాసులు ఈ విషయాన్ని గ్రహించి పోలీసు, దేవస్థానం అధికారులతో సహకరించాలని కోరారు.



ముమ్మరంగా దసరా ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవ ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయ ప్రాంగణంలో క్యూ లైన్లు, లైటింగ్, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు చలువ పందిళ్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







బాలికల హక్కుల కోసం అండగా ఉండాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో బాలికల హక్కుల కోసం ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ కె.ప్రియాంక పిలుపునిచ్చారు. నవజీవన్ బాలభవన్ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని సెయింట్ అన్స్ గరల్స్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించారు. ప్రియాంక మాట్లాడుతూ.. ప్రతి ఏటా ప్రపంచ వ్యాప్తంగా ఆడబిడ్డలపై ఉండే వివక్షతను, హింసను, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించేందుకు ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారన్నారు. ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో బాల వధువులకు భారత దేశం నిలయంగా ఉందన్నారు. 2021 నివేదిక ప్రకారం, భారతదేశంలో ప్రతి ఏడాది 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న 1.5 మిలియన్ల మంది బాలికలు వివాహం చేసుకుంటున్నారన్నారు. ప్రపంచవ్యాప్తంగా బాలికలు విద్య, శారీరక, మానసిక సమస్యలతో బాధపడుతున్నారని వివరించారు. వాటిపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలనే లక్ష్యంతో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని జరుపుతున్నారని చెప్పారు. అనంతరం నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్ ఎండీ వసంతకుమారి మాట్లాడుతూ బాలికలు ధైర్యంతో ముందుకు అడుగులు వేయాలన్నారు. హెచ్ఎం సిస్టర్ రత్న మాట్లాడారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు భార్గవి, విజయ ధనలక్ష్మి, సరస్వతి, నాగ మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.